క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఏలేశ్వరంలో బాలాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఏలేశ్వరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పట్టణంలో శనివారం ఉల్లంఘించారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, మిరియాల శిరీష ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సమీపంలోనే కాకుండా బాలాజీచౌక్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భజన బృందాలకు వస్త్రాల పంపిణీ



కోటనందూరులో నగర సంకీర్తన చేస్తున్న భజన బృందం

కోటనందూరు: పవిత్ర కార్తిక మాసంలో నగర సంకీర్తన చేస్తున్న రెండు భజన బృందాలకు శనివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. లోక కల్యాణార్థం నగర సంకీర్తన చేస్తున్న భజన బృందాలను అభినందిస్తూ స్థానిక ప్రముఖ వ్యాపారవేత్త వెలగా వెంకట సత్యానందం, వైఎస్సార్ సీపీ నాయకుడు, తుని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ నూతన వస్త్రాలు సమకూర్చారు. వీటిని వ్యాపారవేత్త వెలగా వెంకట సత్యానందం కుటుంబ సభ్యులు 34 మంది భజన బృందం సభ్యులకు అందజేశారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ప్రత్తిపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ప్రత్తిపాడు: ఎయిడ్స్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని మినర్వా ఎన్‌సీసీ ఆఫీసర్ జి.సత్యనారాయణ కోరారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మినర్వా ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మినర్వా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జాతీయ రహదారి, మెయిన్ రోడ్డు, అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదు, ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపడం నేరం అంటూ నినాదాలు చేశారు. ఎయిడ్స్ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ ఎస్.రవికుమార్, ఎం. లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



గోపాలపట్నంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితుడు

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో వేంచేసిన ఉమారామలింగేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీపుష్పయాగం కన్నులపండువగా జరిగింది. వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణోత్సవాలు శ్రీపుష్పయాగం ముగిసినట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలి

జగ్గంపేట: విజయవాడలో ఈ నెల 4న నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారు రాజు, అర్జున్ రావు పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపురంలో శనివారం ప్రజా హక్కుల సభపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు విజయవాడ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాజు, రమణ, అచ్చారావు, నాగేశు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో నేలకొరిగిన వరిపైరు



ఎ.అగ్రహారంలో వర్షానికి తడిసిపోయిన వరిపనలు



తొండంగి మండలంలోని సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు

చివరికి కష్టాలు

- వర్షానికి తడిసిన వరి పనలు
- పలు గ్రామాల్లో నేలకొరిగిన వరిచేలు
- పంట ఒబ్బిడి పనుల్లో అన్నదాతలు బిజీ

తుని రూరల్: ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి కోత కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోయింది. పలు గ్రామాల్లో కోతదశకు చేరుకున్న వరిపైర్లు నేలకొరిగాయి. మండల వ్యాప్తంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విస్తారంగా కురిసిన వర్షం, ఈదురు గాలులకు ఇప్పటికే కోసి పనలపై ఉన్న పంట తడిసిపోగా, కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు నేలనంటాయి. పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పత్తి చేలు సైతం తడిసిపోయాయి. ఎస్.అన్నవరం, ఎ.అగ్రహారం, హంసవరం, టి.తిమ్మాపురం, గవరపేట, హెచ్.కొత్తూరు, తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. తుపాను ప్రభావం తక్కువగానే ఉందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు.

చిరుజల్లులతో ఇక్కట్లు

కిర్లంపూడి: తుపాను ప్రభావంతో చిరుజల్లులు పడటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సుమారు 11,500 ఎకరాల్లో ఈ ఏడాది రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. ఇటీవల సంభవించిన వరదలకు సుమారు 6 వేల ఎకరాల్లోని వరి పంటలు నీట మునిగి పూర్తిగా ధ్వంసమయ్యాయి. తుపాను ప్రభావంతో గత మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రైతులు ఆదరాబాదరాగా మెషీన్లతో కొతలు కోయిస్తున్నారు. సుమారు 500 ఎకరాల్లో కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలుగా పెట్టారు. 100 ఎకరాల్లో పంట కళ్లాలోనే రాశులుగా ఉంది. 200 ఎకరాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. మరో 55 ఎకరాల్లో పంట పనలపై ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం చెదురుమొదురు చినుకులు పడడంతో రైతులు కల్లాల్లోని ధాన్యం తక్కువ రేటుకే దళారులకు విక్రయిస్తున్నారు.

ఈదుర గాలుల బీభత్సం

కోటనందూరు: ఫెంగల్ తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులు మండలంలో బీభత్సం సృష్టించాయి. శనివారం ఉదయం నుంచి పెద్దగా వర్షప్రభావం లేనప్పటికీ విరామం లేకుండా భారీగా ఈదురుగాలులు వీస్తున్నారు. గాలుల ధాటికి రెండు వేల ఎకరాల్లో పక్వానికి చేరిన వరి పంట నేలకొరిగింది. ఉద్యాన పంటలు, మొక్కలు, చెట్లు నేలకూలాయి. ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

అన్నదాత హడల్

ప్రత్తిపాడు: ఫెంగల్ తుపాను ప్రభావం వల్ల శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ అడప దడపా పడుతున్న చినుకులతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. ఏటా వరి పంట చేతికి అందే సమయంలో తుపానులు భయపెడుతూనే ఉన్నాయి. ప్రత్తిపాడు మండలంలో రైతాంగం సుమారు 8,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టింది. ఎక్కువుగా ఆర్‌జీఎల్ 2537 రకం వరి వంగడాలనే పండించారు. మండలంలో అక్కడక్కడ రేవతి, సాధన వంటి రకాలను కూడా సాగు చేశారు. వరి పంట చేతికి అందే దశలో వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో గత రెండు రోజులుగా పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతాంగం తలమునలకలైంది. మండలంలో ఇప్పటికే దాదాపు ఆరు వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ప్రత్తిపాడు, పెదశంకర్లపూడి, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో కోసిన పనలు పంట పొలంలోనే ఉన్నాయి. వ్యవసాయశాఖ జగ్గంపేట ఏడీఏ యింటి వీర గంగాధర్, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తదితరులు గ్రామాల్లో పర్యటించి, పనల మీద ఉన్న పంటను కుప్పలుగా వేయించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న వరి పంటను ఎత్తయిన ప్రదేశాలకు తరలించి, టార్పాలిన్లు, బరకాలుతో రక్షణ ఏర్పాటు చేసుకున్నారు.



కిర్లంపూడిలో ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌పై వేస్తున్న కూలీలు

నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి

ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పంట చేలల్లో వర్షపు నీటి నిల్వలుంటే బయటకు పంపేలా రైతులు చర్యలు తీసుకోవాలని జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీఏ యింటి వీర గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, పెదశంకర్లపూడి తదితర గ్రామాల్లో పర్యటించి, రైతులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనల మీద ఉన్న వరి పంట మొలకలు రాకుండా చూడాలన్నారు. ఎకరం విస్తీర్ణంలోని పనలపై వంద లీటర్ల నీటికి ఐదు కేజీల ఉప్పు కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు.



తీరంలో నిలిచిన మత్స్యకారుల బోట్లు

చినుకు.. అన్నదాత వణుకు

తొండంగి: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో కోత కోసిన వరిపంట తడిసింది. శుక్రవారం రాత్రి నుంచే చిరుజల్లులు కురవగా శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ కుండపోత వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే కోత కోసి పనలపై ఉన్న తడిసిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలో ఇంకా 80 శాతం విస్తీర్ణంలో వరి కోతలు కోయాల్సి ఉంది. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారుల సూచనలతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. ఈదుర గాలుల ప్రభావానికి వరి పంట నేలకొరిగింది. పలు చోట్ల హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావానికి సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మండలంలోని అద్దరిపేట నుంచి కొత్తచోడిపల్లిపేట వరకూ సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని వాతావరణశాఖ ప్రకటించడంతో మత్స్యకారులు సముద్రంలో లంగరు వేసిన బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. తుపాను తీరందాటి సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఎఫ్‌డీఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

తుపాను నేపథ్యంలో మండలంలోని పి.అగ్రహారం, శృంగవృక్షం, తొండంగి తదితర గ్రామాల్లో వరి పొలాలను తహసీల్దార్ మురార్జీ, ఏఓ ఎస్.నరసింహం, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. వరికోతలు వాయిదా వేసుకోవాలని, తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. తొండంగిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తుపాను ప్రభావంతో ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. వారి వెంట ఆర్‌ఐ రాజారావు, ఏఈఓ వర్మ తదతరులు ఉన్నారు.



పి.అగ్రహారంలో పంట పొలాలను పరిశీలించిన తహసీల్దార్ మురార్జీ, ఏఓ నరసింహం తదితరులు



కోటనందూరులో నేలకొరిగిన వరి చేలు



ప్రత్తిపాడు శివారులో పనలపై ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



అల్లిపూడి కేజీబీవీ పాఠశాల వద్ద విద్యుత్ వైర్లపై పడిన చెట్టుకొమ్మ

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



కండక్టర్ రాజు దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు, సిబ్బంది

ఏలేశ్వరం: ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉద్యోగ విరమణ పొందిన కండక్టర్ ఎస్‌వీవీఎస్ఎన్ రాజు సన్మాన సభ నిర్వహించారు. డిపో యూనియన్ అధ్యక్షుడు బీవీ రావు అధ్యక్షతన కండక్టర్ రాజును పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ కండక్టర్ రాజు 36 ఏళ్ల ఉత్తమ సేవలు అందించారన్నారు. రాజు సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని వినతి



సాగుదారులతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్: తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని తొండంగి మండలం పి.అగ్రహారం గ్రామస్తులు ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యను కోరారు. ఈ మేరకు శనివారం తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలోని యనమల రామకృష్ణుడు, యనమల దివ్యలను కలసి వినతి పత్రాలు అందజేశారు. తాతముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములను ఇటీవల శ్రీరామచంద్రమూర్తి ఉత్తర మఠం పేరున ఆన్‌లైన్ చేశారని, దీంతో తామంతా హక్కులు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 410 ఎకరాల భూములపై నెలకొన్న వివాదం కోర్టు కేసుల్లో ఉందన్నారు. కోర్టులో కేసు కొనసాగుతుండగా మఠం పేరున రెవెన్యూ అధికారులు భూములను ఆన్‌లైన్ చేయడంపై సాగుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములపై తమకే హక్కులు కల్పించాలని 162 మంది కోరారు. దీనిపై స్పందించిన యనమల తొండంగి తహసీల్దార్, జిల్లా కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. సాగుదారులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



ధర్మవరం వనసమారాధనలో ఉల్లాసంగా గడుపుతున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శనివారం ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రభ, కిర్లంపూడి ఎస్సై సతీష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు బొంగులూరి మధుబాబు, రమణం వెంకట్రావు, జొన్నాల రాజేష్, బుగత శివ, ఆడారి సుగుణ, లింగంపర్తి శివ, పిల్లి బలరాముడు, పలివెల నాగేంద్ర పాల్గొన్నారు.

మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ



మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన యువతికి ధ్రువపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరావు

కిర్లంపూడి: చేతి వృత్తులను ప్రోత్సహిస్తే ప్రతి ఒక్కరికీ ఉపాధి లభిస్తుందని వినయ్ సుంకర్ ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరావు అన్నారు. మండల పరిధిలోని సోమవరం గ్రామంలో మహిళలకు వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ మగ్గం వర్క్‌పై ఆసక్తి ఉన్న మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. తద్వారా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



తొండంగిలో తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తొండంగి: మండలంలోని పి.అగ్రహారంలో ఉత్తరాదిమఠం భూములకు సంబంధించి రైతులు శనివారం తహసీల్దార్ మురార్జీని కలిశారు. పి.అగ్రహారంలోని మఠం భూములను తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. దీనిపై కోర్టులో కేసులు ఉన్నాయని, కొందరు ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఒమ్మంగిలో మెహరా దేవత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలో బవురువాక గిరిజన గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బవురువాకలో ఇటీవల మరణించిన చింతల లోవరాజు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒమ్మంగిలో ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడిన మెహరా దేవతను పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఒమ్మంగిలో ఇటీవల మృతి చెందిన సుంకర వెంకన్న కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, బవురువాక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, కొప్పన సుబ్బారావు, కొప్పన వెంకన్నబాబు, లక్ష్మి, కోదండ, కోలా తాతబాబు, యాళ్ల ఏసు, మాగావు శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదు



తంటికొండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ నాగమహేశ్వరరావు

గోకవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదని డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం, తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో జరుగుతున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఇన్స్టిట్యూషన్ ప్లాంటేషన్ మొక్కల పెంపకం, గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించాలన్నారు. 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాల్లో 10వ తరగతి అంతకన్నా ఎక్కువ చదువుకున్న యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. అసంపూర్ణంగా ఉన్న గోకులాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ గోవిందు, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ రత్నరాజు, సిబ్బంది ఉన్నారు.

ఏఐఎండీఎస్ జిల్లా అధ్యక్షుడిగా బాపూజీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అడ్డాల బాపూజీ ఆల్ ఇండియా మాదిగ డెవలప్‌మెంట్ సమాఖ్య (ఏఐఎండీఎస్) జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సామర్లకోటలో జరిగిన ఏఐఎండీఎస్ సమావేశంలో సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కాపవరపు కుమార్ ఈ మేరకు నియమించారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ తనను ఏఐఎండీఎస్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సమాఖ్య పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకం ఒమ్ముకాకుండా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. మాదిగ, అణగారిన వర్గాల అభ్యున్నతి పాటుపడతానని తెలిపారు.

బాపూజీని అభినందిస్తున్న ఏఐఎండీఎస్ జాతీయ అధ్యక్షుడు కుమార్

